

7న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 7న గోదావరి బాలోత్సవం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్, మనం ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.తులసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రయివేట్ విద్యా సంస్థలకు చెందిన 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. గోదావరి గట్టు, రివర్ బే వద్ద ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ హాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాల కోసం 9347199131, 9949458354 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

నీట్, నెట్ ప్రవేశ పరీక్షలో నష్టపోయిన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని పిడిఎస్‌యు, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన ఆల్ ఇండియా బంద్ విజయవంతం అయ్యింది. జిల్లావ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు బంద్ అయ్యాయి. విద్యా సంఘాల ఆధ్వర్యాన ప్రదర్శనలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ప్రదర్శన చేపట్టారు. పిడియుఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేశ్ మాట్లాడారు. నీట్ పరీక్ష ఫలితాలు నోటిఫికేషన్ నియమ నిబంధనల ప్రకారం జూన్ నెల 14న విడుదల కావాల్సి ఉండగా పరీక్షల నిర్వహణలో లోపాలు బయటకు రాకుండా ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజు జూన్ నెల 4వ తేదీన విడుదల చేయడం అనేక అనుమానాలకు దారి తీస్తోందన్నారు. పరీక్షలో విద్యార్థులకు చిత్ర విచిత్రమైన మార్కులు వచ్చాయని కొంత మంది విద్యార్థులకు 718,719 మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. యుజిసి మాత్రం గ్రేస్ మార్కులు కలిపామని చేతులు దులిపేసుకునే ప్రయత్నం వేస్తూ దాటివేసే ధోరణిలో ఉందన్నారు. గ్రేస్ మార్కులు కలపాలని నీట్ యూజీ నిబంధనలలో లేకున్నా ఎలా కలిపారని ప్రశ్నించారు. ఇప్పటికీ విడుదలైన 1 పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రంలో వరుసగా ఉన్న విద్యార్థులకు ఒకే విధంగా మార్కులు రావడం ప్రవేశ పరీక్ష లోపాలను ఎత్తిచూపుతోందన్నారు. పేపర్ లీకేజీ అయిందని వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం. ఎన్‌డిఎ విచారణ చేపట్టకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవేశ పరీక్షను కేవలం హిందీ, ఇంగ్లీష్‌లో నిర్వహించడం వల్ల దక్షణాది రాష్ట్రాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వక్తం చేశారు. నీట్ యూజీ పరీక్షను స్థానిక బాషల్లో కూడా నిర్వహించి దక్షణాన్ని రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీట్ యూజ్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని, అక్రమాలపై వస్తున్న ఆరోపణలను పరిగణలోకి విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీకత విద్యా వ్యవస్థను రద్దు వ్యవస్థను రద్దు చేయాలని రాష్ట్ర హక్కులను హరించవద్దని హెచ్చరించారు. ఇప్పటికైనా నీట్ పరీక్షలు లీకేజ్ పై దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తక్షణమే స్పందించి నీట్ మీద తమ వైఖరి స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించకుంటే, ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకుడు కె.భాను ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మణికంఠ, ఎస్ఎఫ్ఐ నాయకులు భాస్కర్, జ్యోతిర్మయి, సురేష్, కనక, నాగచైతన్య, లహరి, ఎన్ఎస్‌యుఐ నాయకులు భరత్, సంజయ్, శివాజీ, రోహిత నాయకులు పోల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో బంద్ చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులు


తాళ్లపూడిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు


ఉండ్రాజవరంలో బంద్‌తో మూత పడిన పాఠశాల

తాళ్లపూడి మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం అయ్యింది. ప్రైవేట్ విద్యా సంస్థలు ముందురోజే సెలవు ప్రకటించి విద్యార్థులను పాఠశాలలకు రావద్దని సూచించారు. మలకపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదిగ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ మాట్లాడుతూ బంద్ కారణాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వినోద్, బిఎస్.ప్రసాద్, జిడి.వర్మ, జి.కుమార్, రాజేష్, సురేంద్ర పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలంలో నిర్వహించిన బంద్ విజయవంతం అయ్యిందని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎస్.కార్తీక్ తెలిపారు. నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని, అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని, ఆక్రమాలపై వస్తున్న ఆరోపణలను పరిగణన లోకి, తీసుకొని విచారణ జరిపించి, విద్యార్థులకు న్యాయం చేయాలని కార్తీక్ కోరారు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీకత విద్యా వ్యవస్థను రద్దు వ్యవస్థను చేయాలని, రాష్ట్ర హక్కులను హరించవద్దని హెచ్చరించారు. పాఠశాలకు అప్రకటిత సెలవు కావడంతో విద్యార్థులు పాఠశాల ప్లే గ్రౌండ్‌లో ఆటలు ఆడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రటరీ అశోక్, వెంకటేష్, మనోజ్, హర్షిత్, ఎఐఎస్ఎఫ్ నాయకులు గంటా పవన్, తదితరులు పాల్గొన్నారు.

కువైట్ మృతుల కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు గురువారం స్థానిక గోదావరి బండ్ వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఆర్థిక సాయం చెక్కులను అందచేశారు. ఈ సంధర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, చెందిన జిల్లాకు చెందిన ముల్లేటి సత్యనారాయణ, మీసాల ఈశ్వరుడు కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా కలిసి సాయం అందిస్తామని హామీ ఇచ్చామన్నారు. బాధిత కుటుంబాలకు చెరో రూ.ఐదు లక్షల సాయాన్నిముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేశారని, ఆ చెక్కులని నేడు అందజేశామన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.


కువైట్ మృతుల కుటుంబాలకు సాయం అందిస్తున్న మంత్రి

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సీజనల్ వ్యాధులైన డయేరియా, అనీమియా, ఇతర వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి సూచించారు. గురువారం ఐసిడిఎస్ కార్యాలయంలో విజయకుమారి అధ్యక్షతన అంగన్‌వాడీలు, ఎఎన్ఎంలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ నోడల్ ఆఫీసర్ కె.నాగలక్ష్మి, కంబాలచెరువు యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, డిఐఒ రాజకుమారి, హెచ్ఎస్‌లు, సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం లంకూరులో డయేరియా బాధితులను ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ గురువారం పరామర్శించారు. రోగులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి, సీతానగరంలోని శశికళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. సీజనల్ వ్యాధులు విజృంభించే సమయం కాబట్టి ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ సూచించారు. పరిసరాల పరిశుభ్రత, ఆహార పదార్థాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. లంకూరులో పర్యటించి ప్రజలంతా అత్యంత జాగ్రత్తతో ఉండాలన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. మంచినీటిని కాచి వడపోసుకుని తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చైతన్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అవినాష్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఎంఎల్ఎ

మంత్రి దుర్గేష్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి- గోకవరం

మంత్రి కందుల దుర్గేష్‌ను బుధవారం తంటికొండ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటేశ్వర స్వామి ప్రసాదం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దాసరి సీతారామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేయాలని, టిడిపి, జనసేన పార్టీ మైత్రి ఇలానే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బదిరెడ్డి నాగ సూర్య సత్యనారాయణ, చింతల నాగు, గండుపూడి శ్రీధర్, అడపా దొర, సతీష్ పాల్గొన్నారు.

పలువురికి వైద్య సేవలు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరులో గెయిల్ ఇండియా ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ ఉమా చంద్ రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సుగర్, బిపి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గెయిల్, పారా మెడికల్ సిబ్బందికి ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాచంద్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి 15 రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు ఉచితంగా ఇవ్వడానికి గెయిల్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బూరుగుపల్లి రాజు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 70 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

పైడిమెట్లలో దేవరపల్లి కిషోర్ కుటుంబానికి పలు సంస్థలు, వ్యక్తులు ఆర్థిక సాయం అందిస్తున్నారు. మండల గణాంక అధికారి, మానవతా జిల్లా సభ్యుడు జోడాల వెంకటేశ్వరరావు పలువురు ఉద్యోగులు అందించిన రూ.6000 ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. అరుంధతీయ ఉద్యోగ ఉపాధ్యాయ సమాఖ్య రూ.15 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు పి.జయరాజ్, కెవివి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మాజీ సిఎం రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం ఉమ్మడి ఎపి మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య 91వ జయంతి వేడుకలు గోకవరం ఆర్యవైశ్య సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘ సభ్యులు మాట్లాడుతూ రోశయం సేవలను కొనియాడారు.

కొవ్వూరు మున్సిపాలిటీలో అవినీతి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కొవ్వూరు మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతా శ్యామ్ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ద్వారా పారిశుధ్య కార్మికులను తీసుకుని ఇతరులకు ఇంటి పనులు చేసేందుకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 113 మున్సిపాలిటీలు ఉంటే అధికంగా కొవ్వూరు మున్సిపాలిటీలో నెలకు సుమారు రూ.30 లక్షలు కార్మికుల జీతాల కోసం ప్రభుత్వం నుంచి పొందుతున్నారని తెలిపారు. ఎంతమంది కార్మికులు పారిశుధ్య పనులు చేస్తున్నారో కూడా తెలియడం లేదన్నారు. సుమారు 30 మంది కార్మికులు అధికారుల ఇళ్లలో పనిచేయడం వల్ల పారిశుధ్యం కుంటుపడుతోందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను కూడా పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు

ప్రభుత్వ పెద్దలకు ఎటిఎంలా పోలవరం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వంలోని పెద్దలు ఎటిఎంలా వాడుకున్నారని మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని రాజీవ్ గాంధీ డిగ్రీ కాలేజీ ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో అన్ని ప్రాజెక్టులూ రాతి పొరలపై నిర్మించారని తెలిపారు. 1964లోనే నాగార్జునసాగర్ డ్యామ్ విజయవంతంగా నిర్మించారని తెలిపారు. డ్యాములు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ నిర్విరామంగా నిర్మించిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కుడి ఎడమ కాలువల ద్వారా లక్షలాది ఎకరాలకు నీరందుతోందని తెలిపారు. 1990లో వడ్డి వీరభద్రరావు పోలవరం ప్రాజెక్ట్ కట్టాలని ఉద్యమం చేశారని తెలిపారు. 2004లో అప్పటి సిఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి పోలవరం ప్రాజెక్టుకు అంకురార్పణం చేశారని చెప్పారు. ఇంత కష్టతరమైన డ్యామ్ నిర్మాణానికి డబుల్ డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని నిపుణుల కమిటీ సూచించినప్పటికీ ఖర్చు మిగిల్చుకోవడం కోసం ఒక్కటే డయాఫ్రమ్ వాల్ నిర్మించారని అది కాస్తా ఇప్పుడు కొట్టుకుపోయిందని చెప్పారు. ప్రాజెక్ట్ వైఫల్యానికి నిర్మాణ సంస్థలు బాధ్యత వహిస్తాయా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్ట్ అవకతవకలపై హైకోర్టులో పిల్ వేస్తానన్నారు.

చాగల్లులో స్వచ్ఛ సంకల్ప ముఖాముఖి

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చాగల్లు గ్రామ పంచాయితీ వద్ద గురువారం స్వచ్ఛ సంకల్ప కార్యక్రమం పనులను డివిజనల్ పంచాయితీ అధికారి దాసరి రాంబాబు పరిశీలించారు. పంచాయితీ సిబ్బంది, ఎఎన్ఎంలకు పలు సూచనలు చేశారు. ట్యాంక్‌లు క్లీనింగ్, తాగునీరు ప్యూరిటీ టెస్టింగ్, సానిటేషన్, తడి చెత్త పొడి చెత్త సేకరణ, డ్రెయినేజీల్లో నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపిడిఒ ఎన్.బుజ్జి సానిటేషన్, క్లోరినేషన్, వైరల్ డిసీజెస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చాగల్లు పంచాయితీ పరిధిలో తాగునీటి నిర్వహణ ట్యాంకును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి ఆర్.శ్రావణ్ కుమార్ పంచాయితీ కార్యదర్శి ఎల్.రవి కుమార్ పాల్గొన్నారు.


కడియంలో రంగాకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా రంగా జయంతి

వంగవీటి మోహన్ రంగా 77వ జయంతి సందర్భంగా పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

దేవరపల్లి యర్నగూడెంలో మార్కెట్ వద్ద రంగా విగ్రహం వద్ద, దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్‌లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, జనసేన ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు రంగా విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు.

తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల్లో రంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ లర్పించారు.

కడియం రంగా మిత్రమండలి ప్రతినిధులు, కాపు ఐక్య వేదిక నాయకులు కడియంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిలుకూరు ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గొడుగులు, పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

చాగల్లు మండలం చంద్రవరంలో రంగా విగ్రహాన్ని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. జనసేన నాయకుడు గాయత్రి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి చిరంజీవి, గంట శివరామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రికి సత్యసాయి కార్మికుల వినతి

ప్రజాశక్తి-గోకవరం

తమ సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు మంత్రి దుర్గేష్‌కు గురువారం వినతిపత్రం అందించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షునిగా దుర్గేష్ పలుసార్లు తమకు అండగా నిలిచారని వారు గుర్తు చేశారు. సత్య సాయి కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కట్టుమూరి వీరబాబు తమ సమస్యలను మంత్రికి వివరించారు. 24 నెలలుగా జీతాలు లేకపోవడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ లేని కారణంగా తమకు ఆరోగ్య సమస్యలు వచ్చినా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి దుర్గేష్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇకి ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉందుర్తి ఇసాక్, కట్టంగి మల్లేశ్వరరావు, జొన్నల సురేష్, కాల రామకృష్ణ, సత్యసాయి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం 11 కెవి తాడిపర్రు, వెలగదుర్రు ఫీడర్స్‌లో ఆర్‌డిఎస్ఎస్ పనుల కారణంగా తాడిపర్రు, వెలగదుర్రులో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఇఇ బి.వీరభద్రరావు తెలిపారు. ఈ కారణంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 5:00 గంటల నుంచి 7.00 గంటలు, మధ్నాహ్న 1.00 గంటల తరువాత నుంచి ఇచ్చేలా మార్చినట్టు తెలిపారు.

రేషన్ డీలర్ల అసోసియేషన్ కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-గోకవరం


రేషన్ డీలర్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మలిరెడ్డి కృష్ణ నూతన అధ్యక్షునిగా, ఉపాధ్యక్షులుగా మల్లపురెడ్డి కృష్ణ, బుంగరాజు, కోశాధికారిగా కొండా రమేష్, జాయింట్ సెక్రెటరీగా కాకర విష్ణు, గౌరవాధ్యక్షునిగా వాకచర్ల రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకన్నారు.

మానవత సేవా సంస్థ డైరీ ప్రారంభం

ప్రజాశక్తి-నల్లజర్ల

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ డైరీని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా అనేకమంది పేద ప్రజలను ఆపద సమయంలో ఆదుకోవడం అభినందనీయమన్నారు. సంస్థ సభ్యులందరికీ ఈ సందర్భంగా ఆయన కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జమ్ముల సతీష్, మండల నాయకులు యద్దనపూడి బ్రహ్మరాజు, రిటైర్డ్ ఎంఇఒ ఐడివి అప్పారావు, భోగవల్లి వెంకట సుబ్బారావు, ఎన్.రాజేంద్రప్రసాద్, దొండపాటి దుర్గారావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా గురువారం పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం స్థానిక గోదావరి బండ్‌పై ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, టూరిజం జెడి వి.స్వామినాయుడు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి పి.జగదీష్ నివాళులర్పించారు. డిఇఒ కార్యాలయంలో జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు నివాళి అర్పించారు. ఎడి వెంకట్రాజు, సూపరింటెండెంట్లు ఉమామహేశ్వరరావు, రాజకుమారి, అర్బన్ రేంజ్ డిఐ. బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.


కొవ్వూరులో అల్లూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిడదవోలు గాంధీ నగర్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మాజీ సైనికులు బొచ్చా కష్ణా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం జరిగిన సభలో మహనీయుల ఆశయ సాధన పోరాట కమిటీ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు.

కడియం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ, గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

తాళ్లపూడి తహశీల్దారు శ్రీనివాస్ అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

చాగల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పి.వీర్రాజు, ఇన్‌ఛార్జి హెచ్ఎం మోజెస్ ఇమ్మాన్యుయేల్, పిజిటి శ్రీనివాసరావు నివాళి అర్పించారు.

గోకవరం రంపఎర్రంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. టి.బొజ్జమ్మ, కె.కృష్ణవేణి, కె.మైథిలి, జి.అమ్మాణి, పాపయ్యమ్మ, పాల్గొన్నారు.

ఉండ్రాజవరం తహశీల్దారు కె.నవీన్ కుమార్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిటి కె.పద్మావతి, డిప్యూటీ రీసర్వే డిటి ఎం.హరిప్రసాద్, ఆర్ఐ ఎస్.హరీష్, సీనియర్ అసిస్టెంట్ యు.రవిచంద్ర, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రాజమండ్రిలో అల్లూరికి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్

కొవ్వూరు రూరల్ అల్లూరి విగ్రహం సెంటర్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర బాబు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, పెనుమాక జయరాజు, దగ్గు రాధాకృష్ణ, జట్టు, రిక్షా కార్మికులు ఘనంగా నివాళలర్పించారు.

నల్లజర్ల లయన్స్ క్లబ్, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. అల్లూరి జయంతి సందర్భంగా అక్కిన కృష్ణ కుమారి జ్ఞాపకార్థం 77 మంది కూలీలకు బిస్కెట్లు, డ్రింకులు పంపిణీ చేశారు. అంబటి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానాం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 2,800 లీటర్ల డీజిల్‌ను అధికారులు సీజ్ చేశారు. గురువారం మండలానికి చెందిన పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు పరిధిలోని జాతీయ రహదారి 216పై రెవెన్యూ, విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే యానంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి డీజిల్‌ను ఆక్వా చెరువుల వద్దకు ఆటోపై తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి ఆటోతోపాటు, డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సివిల్ సప్లై డిటి. లక్ష్మీ ప్రసన్న, జిల్లా విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, కోరంగి పోలీసులు సుదర్శన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని సైక్లిస్ట్ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మూలస్థాన అగ్రహారం వద్ద 216(ఎ) జాతీయ రహదారిపై గురువారం కారు ఢీకొని సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక గ్రామానికి చెందిన రేలంగి సూర్యనారాయణ అలియాస్ సూరయ్య(60) జొన్నాడ సెంటర్ వద్ద తన పని ముగించుకుని సైకిల్‌పై స్వగ్రామం మూలస్థానం వెళ్తుండగా రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న కారు వెనుక నుంచి అతనిని ఢీకొంది. దీంతో సూర్యనారాయణ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందరన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు.

బంగారు వస్తువుల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటి బీరువాలో దాచుకున్న బంగారు వస్తువులను తన సమీప బంధువు దొంగలించుకు పోయిందని ఒక మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముమ్మిడివరం నగర పంచాయతీ బాలయోగి కెనాల్ రోడ్‌లో నివాసముంటున్న జిత్తుక సుజని ఇంటికి రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన తమ బంధువు సరేళ్ల తేజస్విని తరచూ వస్తూ ఉండేది. ఈ నేపథ్యంలో గత ఏడాది మే 16న తమ ఇంటికి వచ్చిన తేజస్విని బీరువాలోని సుమారు రూ.2 లక్షల 15 వేలు విలువైన బంగారు వస్తువులను బీరువా పగలగొట్టి దొంగలించి పోయిందని బాధితురాలు తెలిపింది. బంధువుల సమక్షంలో తగవు పెట్టినా బంగారు వస్తువులు తిరిగి ఇవ్వలేవని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా బట్టీపై దాడి : వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సగ్గొండ పరిధిలో సారా బట్టిపై పోలీసులు దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారంతో సగ్గొండ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 140 వద్ద గోపవరం గ్రామానికి చెందిన నక్క సత్యనారాయణ అనే వ్యక్తి నాటు సార తయారు చేస్తున్న బట్టిపై దాడు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో అతను వద్ద ఉన్న రూ.6000 విలువ గల 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, 30 వేలు విలువ గల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ముద్దాయిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

స్కూల్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. బుధవారం మండలంలోని దొండపూడి శివారులో జరిగిన ప్రమాదానికి సంబంధించిన వివరాలను గురువారం ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వెల్లడించారు. వెంకటరెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న కారం సురేష్ బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి తన స్నేహితుడు కొమరం రాంప్రసాద్ మోటారు సైకిల్‌పై గోపాలపురం మండలంలోని దొండపూడి గ్రామానికి వస్తుండగా స్కూల్ బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న కారం సురేష్ తీవ్రగాయాలవ్వడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలో కొత్త ఇంట్లో తాపీ పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రి మృతి చెందిన సంఘటన చాగల్లు గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. మృతుడు సానుబోయిన వీర వెంకట సత్యనారాయణ (37) కొత్తపేటలోని ఒక ఇంట్లో తాపీ పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ మేరకు అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మరణం

ప్రజాశక్తి - నల్లజర్ల

అనంతపల్లిలో ఒక వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఉదయాన్నే స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతి చెందిన వ్యక్తి తమిర్చి వెంకటేశ్వరరావు (48)గా స్థానికులు గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా భార్య సావిత్రి కుమారుడు నాగరాజు వెంకటేశ్వరరావుతో విడిపోయి కొంతకాలంగా వేరేగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో మృతి చెందడం తోపాటు, సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ వరకు రక్తపు మరకలు ఉండటంతో బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడ్డ కాంక్రీట్ మిక్సర్

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కాంక్రీటు మిక్సర్ గురువారం కాటవరం రైస్ మిల్లు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. కాంక్రీట్ మిక్సర్ వేగంగా వస్తూ డివైడర్ ను ఢీకొట్టి బోల్తా పడింది. అదే సమయంలో సీతానగరం వెళ్తున్న ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ప్రమాద సంఘటన ప్రాంతం వద్ద ఆగి ప్రమాదంలో గాయపడ్డా డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు.

యానాం వార్తలు



ప్లాంట్ మేనేజర్‌కి వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

మహిళా కార్మికుల తొలగింపు దారుణం

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని అడవి పొలంలో షెల్డం ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులను అక్రమంగా తొలగించడం దారుణమని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం కార్మికుల సమస్యలపై ప్లాంట్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం స్థాపించిన షెల్డం కంపెనీలో సుమారు 70 మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా, మహిళా కార్మికుల శ్రమను దోచుకుంటూ రోజుకు రూ.200 మాత్రమే యాజమాన్యం చెల్లిస్తుందన్నారు. గతంలో ఐదున్నర గంటలకే ఇంటికి పంపేవారని, ప్రస్తుతం సాయంత్రం 6:00 వరకూ పని చేయించుకుంటున్నారన్నారు. అదనంగా పనిచేసిన దానికి వేతనం కట్టడం లేదని ఆరోపించారు. అదనపు వేతనం కట్టాలని ప్రశ్నించినందుకే రాయుడు ప్రసన్న, చోడే మంగాదేవి, నందికి శ్రీదేవి, రమణ అనే మహిళా కార్మికులను అక్రమంగా తొలగించారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా షెల్డం పరిశ్రమ యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆరోపించారు. అక్రమ తొలగింపులు ఆపాలని, కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్, మెటర్నటి లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ కె.సత్యనారాయణ, సబ్బతి రాంబాబు, త్రికోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, సలాది నాగబాబు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎంఎల్ఎ గొల్లపల్లి

ప్రజాశక్తి - యానాం



చంద్రబాబును సత్కరిస్తున్న అశోక్

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎపి సిఎం చంద్రబాబును యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలను చర్చించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. టిటిడి ద్వారా మీసాల వెంకన్న ఆలయ పున్నర్నిర్మాణానికి, సాగు, తాగునీటి సరఫరాకు సహకరించాలని కోరినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, అమరావతిలో మరోసారి కలిసి సమస్యలపై చర్చించేందుకు రావాలని ఆహ్వానించారని తెలిపారు.

ఘనంగా అల్లూరి జయంతి

ప్రజాశక్తి - యానాం

అల్లూరి సీతారామరాజు జయంతి, వివేకానంద, పింగళి వెంకయ్య వర్ధంతిలను సమాచార శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న వారి విగ్ర హాలకు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్‌పి రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పించారు. గురువారం మిషన్ శక్తి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రిపిక రోసెలిన్ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అడ్వకేట్ పడాల సుబ్బారావు నూతన క్రిమినల్ చట్టాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ ఉమా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహా, పుణ్య, తేజస్వి, సుధా, విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయేరియాపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య శాఖ అధికారి టి.రవిశంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్ర మాన్ని స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభిస్తారని తెలిపారు.

తూతూ మంత్రంగా ఎర్ర పోతవరం గ్రామసభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో ఎర్రపోతవరం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభ తూతూ మంత్రంగా జరిగింది. గ్రామ కార్యదర్శి దామిశెట్టి రామాంజనేయులు గ్రామసభ ఏర్పాటు చేశారు. అయితే సర్పంచ్ ఒక కేసులో అరెస్ట్ అవ్వడంతో పాటు ఉపసర్పంచి వార్డు సభ్యులు ఎవరు గ్రామసభకు హాజరు కాకపోవడంతో వచ్చిన గ్రామస్తులతోనే సభను తూతు మంత్రంగా నిర్వహించారు. అయితే గ్రామంలో పలు అవతవకలు జరిగాయంటూ యువకులు అధికారులను నిలదీశారు. దీంతో కొద్దిసేపు సమావేశం రసాభాసగా మారింది. గ్రామ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు జరిగే గ్రామసభను యథావిధిగా నిర్వహించామని, అయితే సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు సమా వేశానికి రాలేదన్నారు. విఆర్ఒ శరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-రాజోలు

ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు గత ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన రాజ్యాంగ హక్కులను, రాయితీలను, అవకాశాలను, నిధులను పునరుద్ధరణ చేయాలని రాజోలు డిప్యూటీ తహశీల్దార్ ఎస్ శ్రీనివాస్‌కు దళిత చైతన్య వేదిక నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు జిల్లా రాజోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట దళిత చైతన్య వేదిక నాయకులు గురువారం గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాలను, కార్పొరేషన్ నిధులను, సబ్ ప్లాన్ నిధులను పునరుద్ధరణ చెయ్యాలని నినాదాలు చేశారు. అనంతరం రాజోలు డిప్యూటీ తహశీల్దార్ కు మెమోరాండం ఇచ్చిన దళిత చైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వంలో దళితులకు రాజ్యాంగ బద్ధంగా దక్కాల్సిన ఉపప్రణాళిక నిధులు, కార్పొరేషన్ నిధులు, ఎస్‌సి సంక్షేమ పథకాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్‌సి కార్పొరేషన్ నిధులను, ఉప ప్రణాళిక నిధులను, సంక్షేమ పథకాలను పునరుద్ధరణ చేసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల పురోభివద్ధికి కషి చేయ్యాలన్నారు. కార్యక్రమంలో వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకష్ణ, సమన్వయ కర్త బత్తుల జనార్దనారావు, ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్, నాయకులు మందపాటి మధు, జిల్లెళ్ళ వినోద్,మట్టా సురేష్, దీపాటి శివప్రసాద్, తెన్నేటి నాగేశ్వరరావు, బొడ్డపల్లి పుల్లయ్య, పాముల హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో కలవచర్ల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఆలమూరు

తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిక్ బాక్సింగ్ పోటీల్లో మండలంలోని కలవచర్ల మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విజేతలు వివరాలు జూనియర్స్ 35 కేజీల విభాగంలో ఖండవిల్లి మహిమకర్ గోల్డ్ మెడల్, 38 కేజీల విభాగంలో వడ్డి కార్తికేయ గోల్డ్ మెడల్, 40 కేజీల గెద్దాడ జాయ్ కిరణ్ సిల్వర్ మెడల్ సాధించారు. గర్ల్స్ 45 కేజీల విభాగంలో వడ్డి గిరిజ సిల్వర్ మెడల్, సీనియర్ 55 కేజీలు విభాగంలో చల్లా వీరేంద్ర ప్రసన్న కుమార్ గోల్డ్ మెడల్, 60 కేజీలు భాగంలో మెరుపే సత్య కాంత్ సిల్వర్ మెడల్ సాధించారు. విజయవాడ జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో ఆలమూరు గ్రామానికి కీర్తి జస్వంత్ గోల్డ్ మెడల్ సాధించినట్లు మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ తాతపూడి అబ్బులు గురువారం తెలిపారు.

కబ్జాలో ఉన్న స్థలం స్వాధీనం



ద్వారంపూడి కబ్జాలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుంటున్న భూ యజమానులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

గత ప్రభుత్వ పాలనలో కబ్జాకు గురియైన స్థలాన్ని ఎట్టకేలకు భూ యజమానులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వాకలపూడి గ్రామంలో మహిమ చర్చ్ ఆవరణలో 192/ఎ, 154/85, 156/85, 157/85 సర్వే నెంబర్లకు సంబంధించి నాలుగున్నర ఎకరాల భూమిని రెండున్నర ఏళ్ల క్రితం నాటి ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బంధువు భీమస్ రెడ్డి కబ్జా చేశారు. స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మించాడు. దీంతో స్థల యజమానులు సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా వారికి న్యాయం జరగలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో స్థల యజమానులు ధైర్యం చేసి గురువారం ప్రహరీగోడను జెసిబితో కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, స్థల యజమానులు విశ్వనాథం, శ్రీలక్ష్మి మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం స్థలాన్ని కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి పన్నులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అయితే ఆ స్థలంలో ఉన్న చర్చిని, పక్కనే ఉన్న షెడ్లను గతంలో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రౌడీలతో బెదిరించి పోలీసుల అండతో ప్రహరీ గోడ కట్టింటి తాళాలు వేశారన్నారు. ప్రభుత్వం మారడంతో మాకు ధైర్యం వచ్చి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి విషయాన్ని వివరించి మా స్థలాన్ని మేము కాపాడుకోవడం జరిగిందని తెలిపారు. మమ్ములను బెదిరించి రౌడీలతో దాడులు చేయించిన మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరారు. వారాహి కాలనీగా నామకరణం చేసుకున్నట్లు వారు తెలిపారు.

700 సిసిఆర్‌సి కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట



ఎఒ సత్య

మండల పరిధిలో 700 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులు అందజేసినట్లు వ్యవసాయ అధికారి ఇమ్మడిశెట్టి సత్య తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సుమారు 6100 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నామని, ఇప్పటి వరకూ 700 మంది రైతులకు కార్డులు అందించామన్నారు. మండలంలో ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సమాయాత్తంగా ఉన్నామన్నారు. మండలంలో 9,500 హెక్టార్లలో వరిసాగు సాగాల్సి వుండగా, ప్రస్తుతం 9,200 హెక్టార్లలో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. 80శాతం ఎదజల్లే పద్ధతిలో వరిసాగు జరుగు తుండగా, 20 శాతం నాట్లు వేసే పద్ధతిలో జరుగుతుందన్నారు. ఇప్పటికే 12 వందల హెక్టార్‌లలో ఈ పద్ధతిన నాట్లు పూర్తయినట్లు చెప్పారు. యూరియా, డిఎపి, పోయాషియం ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మండలానికి 75 క్వింటాళ్ళు విత్తనాలు రాగా కిలోకు రూ. 5 చొప్పున రాయితీపై రైతులకు రైతు సేవా కేంద్రల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

చిరుధాన్యాల సాగు ద్వారా అధికాదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మెట్ట భూముల్లో చిరుధాన్యాలను సాగు చేయుట ద్వారా రైతులు అధికాదాయం పొందవచ్చునని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వాలు తిమ్మాపురం గ్రామంలోసైనం సాల్మన్‌రాజు వ్యవసాయ క్షేత్రంలో కర్ర పెండలం దుంప సాగు రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. మెట్ట ప్రాంతం చిరుధాన్యాల సాగుకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. ఎకరానికి మూడు కిలోలు చొప్పున రాగులు విత్తనాలు వేసుకున్నట్లయితే 120 రోజులు పంట కాలం తర్వాత 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. డిడిఎ హరి మాట్లాడుతూ కర్ర పెండలం దుంపకు ప్రత్యామ్నాయంగా మెట్ట ప్రాంతాల్లో అపరాలు సాగు చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం ఏసుబాబు, బూసి శ్రీను, పితాని వీరభద్రరావు, భీమరాజు, ఎడిఎ మాధవి, ఎన్‌డిఎ ఎన్.దేవకుమార్, ఎఒ కె.సంజయ్‌కుమార్, ఎఇఒ ఎన్.ప్రసాద్, బిహెచ్ఎ మల్లిక పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల వాయిదా తగదు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల వాయిదా తగదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఓ ప్రకటనలో అన్నారు. మెగా డిఎస్‌సిపై తొలిసంతకం చేసిన ముఖ్యమంత్రి హామీ ఆచరణకు రాకుండా ఉన్న నోటిఫికేషన్ రద్దు కావడం 6 నెలల వాయిదాపడటం దురదృష్టకరమన్నారు. 3 లక్షల మంది సచివాలయ వాలంటీర్ల విషయంలో నిర్దిష్ట ప్రకటన చేయలన్నారు. ఎక్సైజ్ పాలసీ మారుతున్నందున ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న 20 వేల మందికి భవిష్యత్తుకు మార్గం చూపాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో హామీ ప్రకారం డిప్లొమా నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతీ యువకులకు ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతి రు.3 వేలు అందజేసే ప్రభుత్వ కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ధాన్యం బకాయిల విడుదలపై హర్షం

ప్రజాశక్తి - కరప

గత ప్రభుత్వంలో ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలు విడుదల కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన 525 మంది రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలు రూ.4,98,18,000లు విడుదలయ్యాయని ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే గురువారం మండలానికి చెందిన పలువురు రైతులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు బండారు మురళి మాట్లాడుతూ రైతులకు రావాల్సిన బకాయిల అంశాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే అధికారులతో మాట్లాడి బకాయిలను విడుదల చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఎంఎల్ఎ నానాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముత్యాలరావు, గుణ్ణం ఉదయశంకర్, పాలిక సూరిబాబు, కొప్పిశెట్టి బుజ్జి శ్రీను, జి.శ్రీను, పబ్బినీడి బాబ్జి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థుల్లో పఠన, రాత నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య ఆదేశించారు. గురువారం ఆయన మండలానికి చెందిన మాధవపట్టణం జమునా నగర్ ప్రాథమిక పాఠశాల, వికె.రాయపురం సత్యవరపుపేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో హాజరు శాతం, ఎన్రోల్మెంట్ డ్రైవ్, ర్యాలీ కార్యక్రమాల గురించి ఆరా తీశారు. పాఠశాల విద్యార్థులు పఠన, రాత నైపుణ్యాలు, విద్యార్థుల వర్క్ బుక్, టెక్స్ట్ బుక్ కరెక్షన్స్, సిలబస్‌ను పరిశీలించారు. విద్యార్థులు అందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ వాటి గూర్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సత్యవరపు పేట ప్రాథమిక పాఠశాలలో 'నాడు నేడు'లో చేపట్టిన కిచెన్ షెడ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయినవిల్లి విఘ్నేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-అయినవిల్లి



ఆలయ సన్నిధిలో కలెక్టర్ దంపతులు

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ గురువారం సతీసమేతంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి దేవదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలకగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఎస్‌పి శ్రీధర్

జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన రావిరాల మహేష్ కుమార్‌ని జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్, జిల్లా అదనపు ఎస్‌పి ఎస్ ఖాదర్ బాషా కలెక్టరేట్ వద్ద మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేసినారు.

చెముడులంకలో 'నేను బడికి పోతా' ర్యాలీ

ప్రజాశక్తి-ఆలమూరు

మండల విద్యాశాఖ అధికారులు పి.సాలెం రాజు పి.వి.సుబ్బరాజు పర్యవేక్షణలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని మండలంలోని చెముడు లంక ఎస్టిఎస్ఎన్ఎం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేను బడికి పోతా" ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అన్నారు.బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో నేతలు నాగిరెడ్డి వెంకటరత్నం, లంకలపల్లి ఆంజనేయులు, కొత్తపల్లి రాంబాబు, పాలూరి అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంచెలంచెలుగా జిల్లాను అభివృద్ధి చేశాం

ప్రజాశక్తి-అమలాపురం

నూతనంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వనరులు తక్కువగా ఉన్నప్పటికీ జిల్లా కార్యాలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశామని బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వ హించి జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని పలు రకాలుగా నిధులు సమకూర్చుకుంటూ అన్ని వసతులు కల్పించామన్నారు.